# స్మారక చిహ్నం

ఇది నలుగురు ధైర్యవంతుల కథ. వాళ్లను ధైర్యవంతులని యెందుకన్నావంటే వాళ్లే తమ సాహస కార్యాలను ఒక్కొక్కరు చెప్పుకుని మిగతా ముగ్గురి కరతాళ ధ్వనులు అందుకున్నారు.

బన్సీలాల్ పింఛను తీసుకుని ఒక్కయేడాది నిండలేదు. ఇప్పటికీ వాసననూనె మాత్రం అలవాటుకొద్దీ రాస్తుంటాడు. అప్పుడు యెండలో బట్టబుర్ర అద్దంలా మెరుస్తుంది. అతను చెప్పిన కథ కాని కథ యిది..

'నా యవ్వనంలో జాతి ఆడవాళ్లను కూడా వశపరుచుకునే సమ్మోహనం నాలో వుండేదనేవారు. సినీమాకి, హీరోగా వెళ్లిపోమని బలవంతం. ఏంటో నాకు ఆ ధ్యాసే కలగలేదు. ఒకసారి ఏమయ్యిందో తెలుసా? మా పొరుగావిడ అప్సరస.

ఎన్ని సినిమాల్లో హీరోయైతే యింత అందమైన ఆడదాని పరిచయం అవుతుంది? అవిడ మొగుడున్నాడే -ఓ క్షణం అమెను వదిలేవాడు కాదు. బోనులో ఆడపులిని పెట్టి తాళంవేస్తే అది ఆ కామపు కళ్లతో చూడటం మానుతుందా? ఆమెకోరిన అందం, బలం నాదగ్గర వుంది. ఆ యినపగజాలను కొరికి ఒక అర్ధరాత్రి నాచెంత చేరింది. ఆడది యెంతకైనా సాహసిస్తుందని అనుకునేసరికి ఆమె మొగుడన్న వెధవ నాయింటిమీద పడ్డాడు. మెల్లగా తలుపు తట్టాడు. ఆవిడని మంచంకింద దాచేసి తలుపు తీసాను. వాడిచేత కత్తి- నాచేత యేమీలేదు. అప్పుడు నిజంగా స్టంటుపిక్చర్లో హీరోనే అయ్యాను. ఆ ముష్టియుద్ధంలో వాడికత్తి లాక్కొని ఒళ్లు పచ్చడిచేసి వదిలాను. చివరకు యేడ్చుకుంటూ కేక లేసాడు. ఇరుగుపొరుగు లేచి మూగారు. అప్పటికే నా ప్రేయసి యేమీ యెరగనట్లు వాళ్ల యింట్లోకెళ్లి బబ్బుంది. నలుగురూ అనుమానం పిశాచం అంటుకుందని వాడినే తిట్టారు.'

ఇది తనుచెప్పిన లెఖ్కలేనన్ని తన జీవిత చిత్రాలలో ఒకటి. పురుషోత్తమ్‌దాసు పండిన గెడ్డాం పెంచాడని సాధురాం కాదు. అతను స్వవిషయం చెప్పినప్పుడు మిగతా ముగ్గురి శరీరాలు పులకించాయి. అతను తన వేట అనుభవాలు చెప్పాడు. ఒకచేత్తో ఉద్యోగరీత్యా కలం, రెండవచేత్తో సరదాకు తుపాకితో బతికి రెండేళ్లక్రితమే ఉత్తరప్రదేశ్ సర్కారు వారి పంఛనుదారుగా నమోదు కాబడ్డాడు. అతను వేటగాడు అన్న నిదర్శనం అతని యింటికి వెళ్తే తెలుస్తుంది. ఒక పెద్దపులి డ్రాయింగు

రూములో నిల్చొని వుంటుంది. ఎవరు యింటికి వచ్చినా దాన్ని ఎలా చంపాడో వర్ణించి మరీ చెప్తాడు. ఆ రాత్రి చెట్టుమీద దిగువ కొమ్మమీద కూర్చుంటే ఆ పులి తనను అందుకోడానికి తుప్ప సందులోంచి ఒక్క ఎగురు ఎగిరిందట. ఒక్కసారి క్రింద పడ్డాడట. పులి గొంతుక్కే తుపాకీ బిగించి చంపగల సాహసం ఎవరికుంటుంది? ఈ ప్రశ్న ఈ కథ చెప్పిన ప్రతివానికి వేస్తూనే వుంటాడు. అతని యింటినిండా పులి చర్మాలు, దుప్పి చర్మాలు యెన్నో కనిపిస్తాయి. అలా అని అతను యింట్లో వాటిమీద కూర్చొని యోగాభ్యాసం చేస్తున్నాడని అనుకోగలరు, ఆ చర్మాలు తలుపులకూ, కుర్చీలకు, జోళ్లకు, చివరకు పుస్తకాలను బైండ్లు చేయడానికి కూడా వాడుకున్నాడు.

ఇక మూడో అయన చాలా సన్నంగా గాలేస్తే పడిపోయేటట్లుంటాడు. మితభాషి. ఐనా ఒకోసారి స్వంతం చెప్పకోవలసివస్తే గొంతుక బాగా పెగిలి ఒంటిలా మెడ యెత్తి సకిలిస్తాడు. అతను చూపించిన ధైర్యం అంతా క్రియారూపంలోనే చూపించాడు. 'సెంట్రల్ సెక్రటేరియేట్'లో ఆఫీసరుగా వున్న రోజుల్లో అతను రాసిన డ్రాఫ్టులు అద్దాలుకట్టి వుంచవలసినవట. అందులో అర్థం వుందట. ఎలా అతను వెన్ను పూసను వంచకుండా అంత పెద్ద మినిష్టర్లను. ఎంపీలను యెదిరించగలిగిందీ చెప్తుంటే - మధ్యన నాలుగోవాడు దళసరి కళ్లద్దాలతో క్రాఫింగుతోనున్న పొట్టి మనిషి - అడ్డొచ్చి తన సాహసాలను యేకరు పెట్టబోతే - వాళ్ళకంటికి ఒక వ్యక్తి కనిపించాడు. వాడిదీ వీళ్ల వయస్సులానే వుంది. బహుశః వాడూ వీళ్లలా పింఛనీ పుచ్చుకున్నవాడేమో? ఆ బొద్దు మనిషి, తలనిండుగా జుత్తు; ముఖంలో స్ఫుటంగా అంటుకున్న కళ్లద్దాలు. కళ్లీలాల్చీ. పై మీద కండువా. నుదిటమీద మెడమీద గంధం, చెవిలో పువ్వు. కుడిచేతిలో పుస్తకం, రుద్రాక్షమాల - ఎడమ చేతిలో కర్ర.

ఇతనిగురించి చెప్పేముందు ఆ నలుగురు పింఛను మిత్రులు యెక్కడివారు, యెక్కడి కొచ్చారు. యెక్కడ కలుసుకున్నారు- కొంతవరకైన తెలుసుకునే అవసరం వుంది.

వీళ్ల నలుగురి పేర్లు - బన్సీలాల్, పురుషోత్తమ్‌దాస్, మదన్ మోహన్, ఓం ప్రకాష్ - వివిధ ఉద్యోగాలు చేసి పింఛను పుచ్చుకుని యిల్లుకట్టుకుని న్యూఢిల్లీలో నివాసం యేర్పరుచుకున్న అదృష్టవంతులు - సాహస వంతులు. వీళ్లు నలుగురూ రాజేంద్రనగర్‌లో వుంటున్నారు. ఏప్రిల్ నెలలో వుదయం షికారుకు వెళ్లే సమయంలో ఒకరి కొకరికి పరిచయం యేర్పడి చివరకు ఈ నలుగురూ ఒక పార్టీగా యేర్పడ్డారు. ఎవరు ముందు వచ్చినా శంకర్ రోడ్డు మీద గుండ్రని పార్కులో మిగతావారి గురించి అడగవలసిందే. నలుగురూ అక్కడ కూడి రింగురోడ్డుమీంచి బుద్ధజయంతి స్మారకోద్యాన వనంకు కబుర్లు చెప్పకుంటూ నడుచుకుంటూ వెళ్లి తిరిగి రావటం రోజూ రివాజు. ఒక్కోరోజు యెవరో ఒకరు గైరుహాజరైతే మిగతావాళ్లు కాస్సేపుచూసి ఉద్యానవనం వేపు నడవటం జరుగుతుంటుంది.

అసలే గుట్టమీద చిన్న అడవి. ఆ అడవి పచ్చదనంలో అమర్చిన ఉద్యానవనమది. ఎదిగినచెట్లు కొన్ని విరబూసి వుంటే ఆ దిగువ పచ్చని తివాసులు పరచినట్లు గడ్డి. ఎగిరేపూలు ఈ తివాసీలపై ముద్దులు కురిపించుకుంటూ కదలక, వాటిమీదనే

ముసలితనాన్ని ఆహ్వానించుతున్నాయ్. నీరు లేకపోయినా కాలవల్లో లేత మొగలిరేకుల మృదుత్వం కనిపిస్తోంది. అక్కడక్కడ మెత్తని మన్ను పువ్వుల చీరను పోగొట్టుకున్న మగువలా దిగులుగా కనిపిస్తోంది. మళ్లీ ఆ పూలు నిండిన మొక్కలు, ఈ మండు ఎండలను ముంచెత్తే వర్షాలు వస్తేగానీ ఆ మట్టిని కప్పి సింగారించవు. జిరాఫీల్లా తలెత్తుకున్న పోకచెట్లు, ఎండను ధిక్కరించిన ముళ్లదొంకల పచ్చతనం, మూతులు మూడ్చుకొని ఖర్జూరపుచెట్లు. ఒకనాడు ఒళ్లంతా యెర్రపూల కళ్లు చేసుకుని తనచుట్టూ పూలతో పరచుకున్న యెర్ర తివాసీని చూస్తూ మురిసిపోయిన మోదుగచెట్లు – పచ్చని ఆకుల సింగారమైనా లేకపోయినా – ఆశతో బ్రతుకుతున్న మనుషుల్లా యెలా నిల్చున్నాయో నిటారుగా! వుద్యాన వనంలో ఈ నలుగురూ తమ రూపాలు సాధించినవి చెప్పకోవటమే కాదు, తమ కంటికి ఈ ఉద్యానవనంలో కనిపించిన వాటినన్నీటినీ తమ అనుభవాలతో అభిరుచులతో తూయటానికి ప్రయత్నిస్తున్నారు.

'మా రోజుల్లోనా? ప్రేమ కామం కాలేదు. చూడు ఆ జంట ఒళ్లంతా చూపించేస్తోంది. మరి ఆ మగాడు అలా కోతిలా గెంతకుండా, కుక్కలా అరవకుండా వుండగలడూ'

'చూడు ఆ స్టూడెంటు–ఈ పార్కులో చదవటానికి వచ్చి యెటు చూస్తున్నాడో? ఆ టైటుపాంటు–ఆ నడక – ఆ జుత్తు, శుభ్రంగా పూర్వకాలం ముని ఆశ్రమాల్లో విద్యకు చేరిన వాళ్లలా గుండు చెయ్యించి వదిలే– ఆ చదువు అబ్బుతుంది గానీ–ఈ విజిల్సు–రాకెన్‌రోల్–మన రోజుల్లో యింత యిన్‌డిసిప్లిన్ వుండేదికాదు–ఈరోజు విద్యార్థి అర్జించే దేమిటి? గురువుగారికి యెలా పంగనామాలు పెడ్దామా అని చూస్తూంటే?'

'చూడు–తెల్లారింది తిండికి. అప్పడే పిక్‌నిక్. ఆ ట్రాన్సిస్టర్–చెవులు బద్దలైపోతుంది– అది సంగీతమా చావుకేకలా? తీపి తీపి మిఠాయికి తెల్లారిందా? అసలే అలా బలిసిపోయి కదల్లేకపోతుంటే.....'

ఇలా మచ్చుకు కొన్ని వాళ్లు చూసిన దృశ్యాలమీద యిచ్చిన అభిప్రాయాలు. ఈవేళ ఈ కొత్త వ్యక్తి యిదివరకు చూసిన వ్యక్తులకు భిన్నంగా వున్నాడు. అతనిపేరు అడగటం వాళ్లకిష్టం లేదు. వాడివాలంచూసి ఒకసారి యేదో అనుకున్నారు. వాడ్ని మరచిపోవాలని ప్రయత్నించినా మళ్లీ రోజూ యెదురౌతున్నాడు; వారం రోజుల్లో తను భాగవతం చదువుతుంటే చుట్టూ నలుగురు చేరే పరిస్థితి వచ్చింది. ఆ వచ్చినవాళ్లు ముసలివాళ్లే. వాళ్లంతా వాళ్ల నలుగురికి ముసలి నక్కల్లా కనిపించారు. మధ్య మధ్య 'హే భగవాన్ – కరుణించు మమ్ము' అని వాళ్లు అంటుంటే వాళ్లకు వినటానికి కఠినంగా వుంది.

'ఇదంతా స్టంట్ – ఆ భాగవతం చదువుతున్నవాడు, జీవితంలో యెవర్నో ఖూనీ చేసి పట్టుబడక పోయుంటాడు.'

'అసలు – ఈ పటాటోపమంతా యెందుకు? ఈ వేషాలెందుకు? కనపడని వాడ్ని దేముడని కనిపించాడనుకుని మురిసిపోయి – అతనికి భయపడి పిరికివాళ్లయి ప్రార్థించి ముక్తి పొందాననటం – ఇంతకంటె మనిషి మానవుని మేధస్సుకు చేసే అపచారం యింకొకటి ఉందా?'

'ఇదంతా పుట్టి చాదస్తం. సాహసం వున్న మనిషే దేముడు. సాహసమున్న మనిషిని సాహసంలేని మనుషులు కొలిస్తే వాడే వీరుడై వీళ్లను వుద్ధరిస్తాడు.'

'అయ్యా! మన పురోగతికి మతం చేసినంత ద్రోహం యింకేదీ చెయ్యలేదండీ! మతం, మాయ అన్న పదం సృష్టించి ఆ మాయను జయించగల వాడొక్క దేవుడే అన్నీ, మాయతో నిండిన మనుషుల్లారా! దేవుడే మీకు శరణ్యం అన్నారు. అలా అని మనిషిని మాయను జయించలేని పిరికివాళ్లను చేసేసారు.'

ఈ పేరు తెలియని వ్యక్తి వాళ్లల్లో యింత ఆలోచనా పటిమను, వాదించే శక్తినీ రోజుకు రోజూ వృద్ధిచేస్తున్నాడు. అతను రోజూ వస్తున్నాడు. రోడూ అతనికి దూరంగా పోవడానికి వీళ్లు ప్రయత్నిస్తుంటే యేదో ఒకవిధంగా ఆ త్రోవలోనే తిరగటం జరుగుతూంది. ఒకనాడు గజేంద్రుడి ఘోష, ఇంకోనాడు ప్రహ్లాదునికి తండ్రి బాధలుపెట్టే అతను చేసిన దేవుని పొగడ్త, ఇంకోనాడు వామనుని చరిత్ర – ప్రహ్లాదుని బాధలు వాళ్లకే వచ్చినట్లు ఆ చుట్టూ చేరిన వాళ్లు విచారిస్తుంటే, మొసలిపై కోపాన్ని చూపిస్తోంటే....వీళ్ల నలుగురికీ తమాషాగా వుంది. తిరిగి వచ్చేటప్పుడు వేళాకోళంగా మాట్లాడుకోవడం ప్రారంభించారు. అదివారం ఉదయం ముగ్గురే కూడారు. బన్సీలాల్ వాళ్లమాటల్లో మెసిలాడు.

'బహుశః రాత్రి ఒక చుక్క హెచ్చువేసుకున్నాడేమో? లేవలేక పోయుంటాడు.'

'తాగుతాడా?'

'పిల్లా జెల్లా – ఎవరని? వాడూ పెళ్లామేగా? గడించింది యెలా ఖర్చు అవుతుంది?'

'అసలే పుట్టలేదా?'

'నానా తిరుగుళ్లూ తిరిగాడట. ఆ పెళ్లానికి యెప్పుడూ యేదో ఒక జబ్బే!'

'అయితే వాడుచెప్పిన సాహసం – ఆ అప్సరస సంగతి నిజమేనా?'

'వాడి బొంద. ఆ రోజుల్లో నేనూ లక్నోలోనే వున్నాను. వీడే ఆ కథా నాయకుడని ఈ మధ్య తెలిసింది. ఒక తురక అమ్మాయి, పాత నవాబులపిల్ల. సమ్మోహనమైనదే. కాస్త అధునికంగా వుండేవారు. ఆ అమ్మాయికి బురఖా వుండేది కాదు. మెల్లగా వాళ్లయింటి దాసీదానితో పరిచయం చేసుకుని ప్రేమాయణంకు తొలీ మజిలీగా వుత్తరాలు రాస్తే, ఆ అమ్మాయి అన్న చేతికిచ్చేసింది. శుభ్రంగా ఒళ్లు చీరేసి మరీ వదిలిపెట్టాడు. అదీ వీడి సాహసం.....'

మిగతా యిద్దరూ ఫక్కున నవ్వారు. ఆ తరువాత ముగ్గురూ మౌనంగా నడిచారు. ఒకరినొకరు చూసుకున్నారు. ఒకరినొకరు అనుమానించినట్లు తలలు వంచుకున్నారు. ఒకవిధమైన సిగ్గు ముగ్గురిలో చొచ్చుకుంది. ఏదో భయం ఆవరించింది. ఆ భయం విచారంగా మారింది. ఇదివరకు ఒక్కొక్కరు చెప్పుకున్న సాహస కృత్యాలు మౌనంగా నెమరువేసుకుంటున్నారు. తాము యేం చెప్పిందీ, అందులో నిజం యెంత వుందో, చెప్పిన అబద్ధాలను నిజాలుగా యెలా సమర్థించుకోవాలో – తికమకపడి తిరిగి వచ్చినప్పుడైనా మౌనంగానే నడిచారు. నిప్పు చెప్పింది. అబద్ధం నిప్పు చెప్పింది అబద్ధం అని ముగ్గురూ, పోట్లాడుకుని మాట్లాడుకోవటం మానినట్లు నడిచారు. రింగురోడ్డుమీద విమానంలా నడిపే బస్సు డ్రైవర్లుగానీ, స్కూటరు మీద ప్రియుడ్ని పట్టి నలిపేసి ఎర్రని నైలాను చీరను జండాలా యెగురనిచ్చే సుందరి

పొంగునుగానీ, జట్కా సాయిబు ఒక్కకారూ తన గుర్రాన్ని దాటకండా వెళ్లకూడదని పట్టిన పంతాన్నిగానీ.....దేనిమీదా అభిప్రాయాన్ని వెళ్లబుచ్చలేదు.

మరుచటిరోజు వదయం మళ్లీ ఆ ముగ్గురే కలుసుకున్నారు ముగ్గురికీ యేదో అపద పిడుగులా వచ్చి పడ్డట్లు వాళ్ల ముఖాలు చెప్తున్నాయ్. ఒక్కటే స్ఫుటంగా కనిపిస్తోంది– భయం – వాళ్ల మౌనంలో, కదలికలో యెక్కడా భయం తాండవిస్తోంది. ఇన్నాళ్లు జీవితాన్ని పచ్చని వాతావరణంలో, జీవితావసరాలన్నీ పుష్కలంగా దొరికిన చోటునించి, సుఖం పల్లకీ మీంచి కూర్చొని చూసినట్లుండేది. క్షణాల్లో ఒక యెడారిలో, మండుటెండలో గొంతుకార్చుకపోయినా, బుక్కెడు నీరు దొరికే దారి కనిపించని ప్రదేశంనించి జీవితాన్ని అనుభవిస్తున్నట్లుంది. ఇదివరకు వాళ్లకు యింతదూరం చక్కని రోడ్డుమీద కారుమీద ప్రయాణం చేసినట్లే వుండేది. నడవటం అంటే రోత; శ్రమ అనుకుని కారుమీద కులాసాగా ఒంటరిగా ప్రయాణం చేసిన యీ మనుష్యులకు దగ్గరలోనే యెటువంటి వార్నింగ్ లేకుండా రోడ్డు చివర చీకటి అగాధం వుందని ఈనాడే తెలుసుకున్నట్లు నడుస్తున్నారు. కారు దిగలేరు. దిగినా నడవలేరు. నిలవలేరు. తొలిసారి వాళ్లు రెండుగా చీలి ఒకభాగం వేపు యింకోభాగం చూస్తూ ప్రశ్నలు వేసుకుంటున్నట్లు భ్రమపడ్డారు.

ఈ భ్రమ, ఈ భయం నాలుగోవ్యక్తి నీడను చూస్తున్నామన్న అనుమానంవలన వచ్చింది. అతను అంత చనువుగా, ఆప్యాయతగా వుండేవాడే. అతనితలపు అంటే అంత భయం వేస్తోంది. ఏ రోజైతే అతని నిజరూపాన్ని తెలుసుకున్నారో ఆ రోజు ముందురాత్రి చప్పున గుండె జబ్బుతో వచ్చిన బన్సీలాల్ దయ్యమై జడిపిస్తున్నట్లు......

ఏదో వైరాగ్యం ఈ ముగ్గురిలో చొచ్చుకుంది. మెల్లగా బుద్ధజయంతి పార్కుకు వెళ్లారు. ఈ ఉద్యానవనం బుద్ధుని జ్ఞాపకార్థం కట్టబడింది. అసహ్యమైన ఈ యెముకల గూడుకు అంటుకున్న మాసం కండల్లా మనుషుల్లో మమకారం అంటుకుని విజృంభించి ప్రాపంచిక సౌఖ్యాలతో, క్రౌర్యం, కుచ్చిత బుద్ధి, కపటనాటకాలతో జీవితం గడిపే యీ మాయా మోహితులకు – ముక్తి ప్రసాదించాలని పాటుపడిన వ్యక్తి జ్ఞాపకార్థం ఈ వుద్యానవనం కట్టబడింది. నిత్యం చీకటిలో నివసించే మానవాళికి వెలుగు చూపించాలన్న తాపత్రయంతో సర్వస్వం త్యాగంచేసిన మహానుభావుని గుర్తుకు తెచ్చుకోవాలని లేవదీసిన స్మారక చిహ్నం యిది. పుట్టుక చావులమధ్య మనిషి చేసిన ఆలోచన, ఆడినమాట, చేసినపనీ, క్రోడీకరించి ఫలితాన్ని కర్మపరంచేసే వెలుగుందని మనుషులకు గుర్తుకు తెచ్చిన బుద్ధుని పేర వెలసిన పచ్చని వనమిది.

ఇలాంటి వెలుగుకు చిహ్నంగా వెలసిన పచ్చనిచెట్లూ, గడ్డి పరదాలు, పూల పాన్పులూ, తియ్యని నీటికాలవల మధ్య నీతికి కట్టుబడని ప్రేమ వికారాలూ, ఉద్రేకాలను రెచ్చకొట్టే అవయవాల ప్రదర్శనలు, సర్వస్వం కడుపుతోనే వుందని గుర్తుకు తెచ్చే తిళ్లు, శరీరాలను మోయలేని మనుషుల మమకారం – కొందరు మానవరూపాలతోనున్న జలగలు, అంబోతులూ, పేలు, నల్లులు, బల్లులూ, ఊసరవెల్లులూ, విషసర్పాలు, వీధికుక్కలూ నక్కలూ, నలుసులూ, అపకారంచేసే సూక్ష్మజీవులూ – ఇన్ని అన్ని, ఎన్నెన్నిరకాల వ్యక్తుల మాయకు అలవాలమైందీ వెలుగుకు కట్టిన స్మారక చిహ్నం.

ఈ మాయోద్యాన వనంలో ఒకమూల భాగవతం చదువుతున్న వ్యక్తి ప్రహ్లాదుని గురించి చదువుతూ ఆపి, చుట్టూ మూగిన ముసలివాళ్ళతో చెప్తున్నాడు–

'మనం చాల ధైర్యమైనవాళ్లమనుకుంటాం - నిజమే, కాని'

ఈ మాట వినగానే యీ ముగ్గురూ సంశయిస్తూనే ఒకరి తరవాత ఒకరు ఆ జనంలో కూర్చున్నారు. ఎవరో చిన్న ప్రశ్నలు వేస్తున్నారు. అతను పెద్ద సమాధానాలిస్తున్నాడు.

'మా మిత్రుడొకడు, మీదపడ్డ పులితో పెనుగులాడి చంపాడు. ఎంత ధైర్యం? ఆ ధైర్యం, సాహసం భయంవల్లన వచ్చింది. అంత ధైర్యం తెచ్చుకోకపోతే అతనికి చావు తప్పదు. మనుషుల కష్టాలు చూసి ముక్తిమార్గం చూపిద్దామన్న ప్రేమతో ఐశ్వర్యాన్ని రాచరికాన్ని, భార్యబిడ్డలను వదలి బుద్ధుడు వెళ్లాడు. ఈ ధైర్యం, సాహసం ప్రేమవలన వచ్చింది. ఏ ధైర్యం మీకు కావాలి?'

'ప్రహ్లాదుడు ప్రార్థించగానే దేముడు రక్షిస్తాడు. అసలు దేముడున్నాడా?'

ఈ ప్రశ్న పురుషోత్తమదాస్ వేసాడు ప్రహ్లాదుని యెదర యిద్దరున్నారు. ఒకడు మనిషి పొందగలిగే అన్ని అధికారాలుగల హిరణ్యకశిపుడు. రెండోవాడు ప్రేమ, సత్యం, దయ, ధర్మాలతో నిత్యం వెలుగుతున్న మహాసుందరుడు - మహావిష్ణువు. మనిషి యెవరికో దేనికో భయపడుతూనే అన్ని పనులూ చేస్తుంటాడు. హిరణ్యకశిపుని లాంటి లోటుపాట్లున్న మనిషికి భయపడే బదులు, లోటుపాట్లు లేని వూహించిన వెలుగును భక్తితో ప్రహ్లాదుడు కీర్తించడం మంచిదికదా? ఈ దేవుని కీర్తించటం అన్నది నిజానికి మనిషి ఉత్తమ విలువలకు చేసే కీర్తన, అది మనిషికి అచంచలమైన విశ్వాసం యిస్తుంది. ఆ విశ్వాసమే ప్రహ్లాదుని రక్షించింది.'

మూడురోజులు వరసగా ముగ్గురూ కలసి భాగవతం విన్నారు. ఇంతవరకూ వాళ్లకు చెప్పటమేగాని వినటం అలవాటు లేదు. ఏ ఒక్క విషయంమీద గురికూడా లేదు. ఎదుటివాళ్ల సాధన, ప్రగతి, ఉన్నతి వాళ్లకు రుచించదు. ఈ మూడు రోజులూ, శ్మశాన వైరాగ్యంతో బంధింపబడిన కాళ్లు నాలుగోరోజుకు విడిపోయాయి. ఆ భాగవతం చదివే కళ్లద్దాల మనిషి దరిదాపుల్లోనికి వెళ్ళటం మానేసారు. మిత్రుడు బన్సీలాల్ ఆకారం మరిచిపోతున్నారు. అతని నీడేకాదు. వాళ్ళనీడలే చూసుకోవటం లేదు. ఈ లోకంలో కన్నుల పండువచేసే అందం, మనిషిని ఆహ్లాదపరచే ఆలోచనలు చేసుకునే స్వేచ్ఛవుండగా నల్లని నీడలవేపు, లోనున్న అగాధాల అట్టడుగున అణుశక్తిలా వెలిగే వెలుగువేపు చూడాలనే తాపత్రయం యెందుకు? శ్రమ దేనికి?

ఇన్నిరోజులూ వాళ్లు పొందలేమన్న నిస్పృహవల్లనే కనిపిస్తున్న కొత్తను ఘాటుగా విమర్శిస్తున్నారు. నిజానికి వాళ్లకోరికలు యిప్పుడే విజృంభిస్తున్నాయ్. వాళ్లే స్కూటరుమీద యేభైమైళ్ల స్పీడులో పోగలిగితే - ఆ వెనుక సీటులో నవనవలాడే యౌవని గట్టిగా వాళ్లను అదిమిపట్టుకుని యెర్రని షిఫానుచీర పమిటచెంగు జెండాలా యెగురవేస్తే - టేపురికార్డరు అందిస్తున్న పాశ్చాత్య సంగీతానికి లయగా గెంతుతున్న సుందరీమణులతోపాటు తాము ట్విస్టు చెయ్యగలిగితే - ఆ చక్కని వైట్ పేంట్లు - పాయింటెడ్ షూలతోపాటు, ఆ నల్లని జుత్తు - నవనవలాడే సొగసుతో - ఆ ప్రేమ పిలుపులు, ఆ కిలకిలలు, ఆ కామం నిండిన కళ్లు......యివ్వన్నీ అనుభవించడానికి మళ్లీ మళ్లీ యౌవ్వనం అంకురిస్తే యెంత బావుణ్ణు! ఎంత హాయిగా వుణ్ణు?

ఈ మధ్యనే మనిషి నాటకంలో చివరి అంకం యేమిటో బన్సీలాల్ చావు గుర్తుకు తెచ్చింది కాబట్టి – యింకో కోర్కె – ప్రగాఢమైన కోర్కె కలిగింది యీ ముగ్గురికీ – తాము పోయాక తమకు స్మారక చిహ్నంగా వో పచ్చని అందమైన బుద్ధా పార్కు, లేక అద్భుతంగా నిల్చున్న యిండియా గేటో లేస్తే..... ఎంత అదృష్టం! తాము బ్రతికి పొందిన అదృష్టం కొండ అయితే, అదో హిమాలయ శిఖరం! మానవాళి సుఖ శాంతులకోసం ఒక వ్యక్తి చేసిన త్యాగం జీవవాహినియై ఈ బుద్ధ పార్కులో ఈ పచ్చదనాన్ని పూల అందాన్ని సృష్టించిందనీ, నిత్యం నిలిచిపోతుందనీ – ఈ మట్టిలో మెసలిన వీరపుత్రుల వేడిరక్తం యింకిపోకుండా యిండియా గేటులో చెక్కిన పేర్లలో నిత్యం చిమ్ముతుంటుందనీ.. ..బహుశః కావాలనే అల్లా అనుకోలేదు వీళ్లు ముగ్గురూ!

మనుషుల కోరికలు కొలవలేని శిఖరాలు. సంఘానికి కరుణతో ప్రేమతో యేమీ యివ్వని వ్యక్తులే సంఘం యిచ్చిన సుఖంతో, కోరికల కోటలు కట్టుకుంటారు. ఈ ఆకాశహార్మ్యాలు, పేకమేడలు – అవీ కూలిపోతాయి – ఆ మనుషులూ నామరూపాలు లేకుండా పోతుంటారు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 4-9-1970)

* * *